సాక్షి నిర్మల్

7

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



వినాయక సాగర్‌లో గణనాథుల నిమజ్జనం



శోభాయాత్రలో భక్తులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సమష్టిగా అభివృద్ధి సాధిద్దాం

- సమైక్యత, సమగ్రతలను కాపాడుకుందాం
- ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రంలో 'ప్రజాపాలన'
- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



జెండా వందనం చేస్తున్న రాజయ్య కలెక్టర్, ఎస్పీ

నిర్మల్/నిర్మల్‌టౌన్: తెలంగాణ స్వాతంత్య్రం కోసం పోరాడిన యోధుల స్ఫూర్తితో అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని, రాష్ట్ర సమైక్యత, సమగ్రతలను కాపాడుకుందామని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజయ్య హాజరై జాతీయ పతాకం ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్‌తో కలిసి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం రాజయ్య మాట్లాడారు. చరిత్రలో 1948, సెప్టెంబర్ 17 తేదీకి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. తెలంగాణ స్వాతంత్య్రం పొందిన ఈ రోజును రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తుండటం హర్షనీయమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అభయ హస్తం హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు.

మహాలక్ష్మి పథకం మొదలు..

మహాలక్ష్మి పథకం పేరిట ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణం ప్రారంభించిందని రాజయ్య పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.14 కోట్ల మంది ఈ పథకాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, జిల్లాలో 3,189 మంది వినియోగించుకున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగానే రూ.500లకే వంటగ్యాస్ అందిస్తున్నామని, జిల్లాలో 1,09,500 మంది లబ్ధి పొందుతున్నారన్నారు. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, రైతుల రుణమాఫీ, పంటల బీమా పథకం, విద్యావ్యవస్థలో మార్పులు ఇలా ఎన్నో పథకాలను, కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. నాటి రాచరిక పాలననుంచి తెలంగాణ ప్రాంతం విముక్తి కోసం జరిగిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న రాజయ్య

అలరించిన కార్యక్రమాలు..

ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రదర్శించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు రాజయ్య, కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోనే బాలశక్తి పోస్టర్లను కలెక్టర్, ఎస్పీతో కలిసి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన..





సెల్యూట్ చేస్తున్న ఎస్పీ, నివాళులర్పిస్తున్న కలెక్టర్

పోలీస్ కార్యాలయంలో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ జానకీ షర్మిల జాతీయ జెండా ఎగురవేశారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. డీఎస్పీ గంగారెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ జానకీషర్మిల

చరిత్ర భావితరాలకు తెలియాలి



అమరవీరుల స్థూపం వద్ద కవులు, సాహితీవేత్తలు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ విమోచన ఉద్యమ చరిత్ర, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సాయుధ పోరాటంలో భాగస్వాములైన యోధుల గురించి భావితరాలకు తెలియాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని వేయి ఉరులమర్రి చెట్టు వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నిర్మల భారతి సాహిత్య కళాసేవ క్షేత్రం, తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. నాటి నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరుల చరిత్రను ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నిజాం వ్యతిరేక పోరాటం చేశారన్నారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు ఆనాటి చరిత్రను నేటి తరానికి తెలియజేసే సాహిత్యాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్మల భారతి సంస్థ అధ్యక్షుడు తోడిశెట్టి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కృష్ణంరాజు, యువకవి, కళాకారుడు పోలీస్ భీమేశ్, అంబటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇటు ప్రజాపాలన.. అటు విమోచన



కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం..



బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం..

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమైన సెప్టెంబరు 17ను పురస్కరించుకుని మంగళవారం జిల్లాలో తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమం నిర్వహించింది. ఇక విమోచన దినం పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బీజేపీ అధికారికంగా వేడుకలు నిర్వహించింది.

శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్మల్‌లో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. జాతీయ గీతం, తెలంగాణ గీతాన్ని ఆలపించారు.

బీజేపీ కార్యాలయంలో..

ఇక బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం జాతీయ గీతం ఆలపించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా కార్యదర్శి మెడిసమ్మె రాజు, కోరిపల్లి శ్రావణ్‌రెడ్డి, అలివేలు మంగ, పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ నాయకులు పాల్గొన్నారు.

బైబై.. గణేశా



శోభాయాత్రలో గణనాథుని ఎదుట నృత్యం చేస్తున్న యువకులు



చిన్ని గణనాథునితో చిన్నారి

- గంగమ్మ ఒడికి చేరిన గణనాథులు
- శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎస్పీ
- డప్పు చప్పుళ్లు, డీజే పాటలు, నృత్యాలతో వీడ్కోలు పలికిన భక్తులు

నిర్మల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ పట్టణంలో వాడవాడలా కొలువుదీరి 11 రోజులు భక్తుల పూజలందుకున్న గౌరీపుత్రుడు మంగళవారం గంగమ్మ ఒడికి చేరాడు. భక్తి శ్రద్ధలతో నిత్యం గణనాథులను కొలిచిన భక్తులు.. డప్పు చప్పుళ్లు, డీజే పాటలకు నృత్యాలు చేస్తూ.. భక్తి గీతాలు ఆలపిస్తూ.. సాంస్కృతిక ప్రదర్శనలతో శోభాయాత్ర నయనానందకరంగా సాగింది. గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక బుధవార్‌పేట్‌లోని ఒకటో నంబర్ గణపతి వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకీషర్మిల, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, ఉత్సవ సమితి నాయకులు, పట్టణ ప్రముఖులు, పూజలు చేశారు. అనంతరం వరుసగా మూడు నంబర్ల వినాయకుల వద్ద పూజలు చేసి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే నిర్మల్ వినాయక ఉత్సవాలకు ప్రత్యేకత ఉందన్నారు. పట్టణ ప్రజలంతా సమష్టిగా వినాయక ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకుందామన్నారు.

ప్రశాంతంగా నిర్వహించుకుందాం..

జిల్లావ్యాప్తంగా వినాయక ఉత్సవాలు ఘనంగా సాగాయని, భైంసాలో పూర్తిచేసినట్లే నిర్మల్‌లోనూ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకుందామని ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు ఇవ్వకుండా సమష్టిగా ఉత్సవాలు పూర్తిచేసుకుందామన్నారు. అనంతరం ఉత్సవ సమితి నాయకులు, స్థానికులతో కలిసి కాసేపు ముఖ్యఅతిథులు స్టెప్పులు వేసి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు ముప్పిడి రవి, కార్యాధ్యక్షుడు పతికె రాజేందర్, ప్రధాన కార్యదర్శి దొనగిరి మురళి, కోశాధికారి మూర్తి ప్రభాకర్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, స్థానిక బుధవార్‌పేట్ గణేశ్ మండళ్ల నిర్వాహకులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



బుధవార్‌పేట్‌లోని ఒకటో నంబర్ గణపతి వద్ద పూజలు చేస్తున్న ఎస్పీ జానకీషర్మిల, ఎమ్మెల్యే

రోజంతా నిమజ్జనోత్సవం..

జిల్లాకేంద్రంలో కేటాయించిన నంబర్ల వారీగా గణనాథుల శోభాయాత్ర ముందుకు సాగుతోంది. ఒకదాని వెనుక ఒకటిగా పురవీధులగుండా సాగే ఈ వేడుక భక్తులను ఆకట్టుకుంది. పట్టణవాసులే కాకుండా పల్లెల నుంచి వేలాదిగా తరలివచ్చి వేడుకను వీక్షించారు. జిల్లాకేంద్రంలో వినాయక నిమజ్జనోత్సవంలో మరో ఆనవాయితీ కొనసాగుతూ వస్తోంది. దాదాపు 24 గంటలపాటు ఈ శోభాయాత్ర సాగుతూనే ఉంటుంది. మంగళవారం ప్రారంభించిన శోభాయాత్ర దాదాపు బుధవారం సాయంత్రం వరకు సాగే అవకాశం ఉంది.



నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు..



శోభాయాత్రలో చిన్నారుల సందడి..





శోభాయాత్రలో మహిళల కోలాటం..



ఎస్పీతో మహిళల గ్రూప్ ఫొటో



శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

భోసిలో కర్ర వినాయకుడి నిమజ్జనం

తానూరు: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 11 రోజులు భక్తుల విశేష పూజలందుకున్న భోసి గ్రామంలోని కర్ర గణనాథుడి నిమజ్జనం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు నాగనాథ్, అధ్యక్షుడు మురళి కర్ర వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించారు. చివరి రోజు కర్రవినాయకున్ని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ముందుగా ఉట్టి కొట్టి పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించారు. శోభాయాత్రలో బ్యాండు మేళాలకు అనుగుణంగా భక్తులు నృత్యాలు చేశారు. కోలాటం, భక్తిగీతాల ఆలాపన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్ర వినాయకుని లడ్డు రూ.82 వేలకు గ్రామానికి చెందిన తుంగెన సుదర్శన్ దక్కించుకున్నాడు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం బావి సమీపంలోకి తీసుకెళ్లి నీళ్లుచల్లి ప్రత్యేకంగా తయారు చేసిన బీరువాలో కర్ర వినాయకుని భద్రపరిచారు.



భోసిలో కర్ర వినాయకుని శోభాయాత్ర..

కొరడి గణేశుని..

భైంసారూరల్: మాటేగాం గ్రామంలో కొలువు దీరిన కొరడి గణేశుని నిమజ్జనం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ఆలయంలో ముడుపులు విప్పారు. కొరడి గణేశుని లడ్డూను వేలంలో రూ.85 వేలకు హంపోలి గ్రామానికిచెందిన పాండురంగ్ పటేల్ దక్కించుకున్నారు. శోభాయాత్ర అనంతరం కొరడి గణేశునిపై నీళ్ల చల్లి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బీరువాలో భద్రపరిచారు.



మాటేగాంలో కొరడి గణేశుని శోభాయాత్ర..

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి నిమజ్జనం జరిగే బంగల్‌పేట్ చెరువు ప్రాంతంలో కల్పించాల్సిన సౌకర్యాలను అధికారులకు సూచించారు. చెరువు నీరు కలుషితం కాకుండా, వెంట వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. అధికారులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించాలన్నారు. నిమజ్జనం ప్రదేశంలో అంబులెన్స్‌తో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అగ్నిమాపక, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సహస్ర మార్షల్ ఆర్ట్స్ అకాడమీ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్, సబ్ జూనియర్ బాల బాలికల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ పోటీలను ప్రారంభించారు. అనన్య (44–46 కేజీలు), అభినయ(46–48 కేజీలు), వనజ(52–54 కేజీలు), శ్రావణ్ (58–61 కేజీలు)తోపాటు వివిధ కేటగిరీలో 14 మంది బాలికలు ఎంపికయ్యారు. అక్టోబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను జిల్లా బాక్సింగ్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి చందుల స్వామి, కోచ్‌లు చిరంజీవి, శేఖర్, శ్రీకాంత్, మనిషా, శ్రీజ అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

భైంసాటౌన్: నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం ఎందరో మహానుభావులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. భైంసా పట్టణంలోని ఎస్ఎస్.కాటన్‌లో తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. రజాకార్ల అరాచకాలపై రాంజీగోండ్, కుమురంభీం, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి ఎందరో ఉద్యమకారులు పోరాటం చేశారన్నారు. 4,500 మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వారి ప్రాణ త్యాగంతో తెలంగాణకు విముక్తి లభించిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, కౌన్సిలర్ గౌతమ్ పింగ్లె, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి రామారావు పటేల్

అంబులెన్స్ కోసం వినతి

కడెం: మండల కేంద్రంలో 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని స్థానిక నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కోరారు. ఈమేరకు ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఏర్పాటు చేసిన అంబులెన్స్ పదేళ్లు పనిచేసిందని తెలిపారు. తర్వాత దానిని మరోచోటికి పంపించారని పేర్కొన్నారు. ఇప్పుడు ఖానాపూర్ అంబులెన్స్‌పై ఆధారపడుతున్నామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, వాజీద్‌ఖాన్, భూషణ్, రాజు, రమేశ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

బీజేఎల్పీ నేత రక్తదానం

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రక్తదానం చేశారు. దేశ ప్రజల జీవితాలను సంతోషంగా ఉంచేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న ప్రధాని మోదీ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు రావుల రాంనాథ్, అంజుకుమార్‌రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, కమల్ నయన్, మెడిసెమ్మె రాజు, అరవింద్, విలాస్, మంగ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఫ్రిజ్ దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి వాడలోగల గోదావరి ఇంట్లో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిజ్ దగ్ధమైంది. ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.20 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబం పేర్కొంది.

పాతకక్షలతో యువకునిపై దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లి హన్మాన్‌బస్తీలో పాత కక్షలతో ఓ యువకుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. హన్మాన్ బస్తీకి చెందిన వేల్పుల శ్రావణ్‌పై సోమవారం రాత్రి అదే బస్తీకి చెందిన రాసబత్తుల గణేశ్, గుగ్గుస్ శ్రీనివాస్ దాడిచేసి గాయపరిచారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ శివారు ప్రాంతంలో మంగళవారం పేకాటస్థావరంపై దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.9,210 నగదుతో పాటు 5 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. దాడిలో స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఈతచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

కాసిపేట: మండలంలోని మల్కెపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిపాముల రామాగౌడ్ మంగళవారం ఈత చెట్టు పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఉదయం రామాగౌడ్ ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా తాడు తెగడంతో కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాలికతో అసభ్య ప్రవర్తనకు ఐదేళ్ల జైలు

చింతలమానెపల్లి: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.12వేల జరిమానా విధిస్తూ మంగళవారం ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చారు. మండలంలోని దిందా గ్రామానికి చెందిన బాలికతో అదే గ్రామానికి చెందిన దుర్వ భాస్కర్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. భయపడిన బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2020 నవంబర్ 3న పోక్సో చట్టం కింద కేసు నమోదు కాగా నిందితుడిని కోర్టులో హాజరు పర్చారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు. నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ ఎం.రమేశ్, ఎస్సై నరేశ్, కోర్టు కాగజ్‌నగర్ లైజనింగ్ అధికారి బాబాజీ, సిబ్బందిని ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు అభినందించారు.


విదేశీ విద్యకు ప్రోత్సాహం

- పథకం కింద రూ.20 లక్షల వరకు రుణం
- దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 13 వరకు అవకాశం
- అవగాహన కల్పిస్తే మరింత సద్వినియోగం

మంచిర్యాలటౌన్: విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతికి చెందిన ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం విదేశి విద్యానిధి పథకం ద్వారా చేయూత అందిస్తోంది. ఏదేని డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువులకోసం విదేశాలకు వెళ్లాలని ఆసక్తి ఉన్నవారికి అందుకు అవసరమయ్యేందుకు గానూ విడతకు రూ.10 లక్షల చొప్పున రెండు విడతల్లో రూ.20లు అందిస్తుంది. నిరుపేద, మధ్యతరగతికి చెందిన ఎస్సీ విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పేరిట రుణాలు అందిస్తున్నారు. 2014–15లో ఎస్సీ, ఎస్టీలకు ఈ పథకాన్ని ప్రారంభించి అమలు చేస్తుండగా అవగాహన లేకపోవడంతో పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఏటా సెప్టెంబర్, జనవరి మాసాల్లో అవకాశం కల్పిస్తున్నా ఇప్పటికీ మంచిర్యాల జిల్లా నుంచి విదేశాలకు వెళ్లిన విద్యార్థులు 20లోపే ఉన్నారు.

అవగాహన కల్పిస్తేనే..

విదేశీ విద్యకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందించేందుకు ఏటా రుణాలు అందిస్తున్నా పథకంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువమంది సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం పథకం ద్వారా లబ్ధి పొందినవారు 19 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది అక్టోబర్ 13వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయించాల్సి ఉంది. ఎంపిక ప్రక్రియ, ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ వివరాలన్నీ రాష్ట్ర స్థాయిలోనే ఉంటున్నందువల్ల ఈ పథకం ద్వారా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు? ఎవరెవరు లబ్ధి పొందారనే వివరాలు వెంటనే జిల్లా అధికారులకు తెలియడం లేదు. ఈ పథకం ద్వారా ఏటా అవకాశం కల్పిస్తున్నా క్షేత్రస్థాయిలో విద్యార్థుల దరిచేరడంలేదు.



పథకానికి దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్

అర్హతలు, కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు

అంబేద్కర్ విదేశి విద్యానిధి పథకం కోసం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు 2024 జూలై 1 నాటికి గరిష్ఠ వయస్సు 35 ఏళ్లలోపు ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉండాలి. ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ టెస్టులో ప్రతిభ ఉన్న విద్యార్థులకు అవకాశం ఉండగా ఒక కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే అవకాశం ఉంది. ఇంజినీరింగ్ సైన్స్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, నర్సింగ్, సామాజికశాస్త్రం కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉంటుంది. టోఫెల్‌లో 60 శాతం, ఐఈఎల్‌టీఎస్‌లో 8.0 శాతం మార్కులు, జీఆర్‌ఈ, జీమ్యాట్‌లో 50 శాతం అర్హత మార్కులు పొందాలి. పీజీ, పీహెచ్‌డి చేసే విద్యార్థులు డిగ్రీలో 60 శాతం మార్కులు సాధించాలి. విద్యార్థుల కులం, ఆదాయం, జనన ధృవీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ మార్కుల మెమోలు, టోఫెల్, ఐఈఎల్, టీఎస్‌జీఆర్‌ఈ, జీమ్యాట్ అర్హత, విదేశాల్లో విద్యాభ్యాసం చేసేందుకు సంబంధిత కళాశాల నుంచి పంపిన ప్రవేశ అనుమతి పత్రం, కళాశాల ప్రవేశ రుసుం చెల్లించిన రశీదు, బ్యాంకు ఖాతా పుస్తకాలు ఉండాలి. సంబంధిత ధృవపత్రాల ఆధారంగా ఆన్‌లైన్‌లో తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ https://telangana.epass.cgg.gov.in లో అక్టోబర్ 13 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

దరఖాస్తు చేసుకోవాలి



విదేశాల్లో విద్యను అభ్యసించాలనే ఆసక్తి ఉండి అర్హులైన విద్యార్థులకు విదేశీ విద్యానిధి పథకం ద్వారా ప్రభుత్వం రూ.20 లక్షల రుణం అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విదేశాల్లో చదవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రవీందర్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, మంచిర్యాల

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. మంగళవారం కృష్ణా కాలనీలోని సివిక్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో కాంట్రాక్ట్ కార్మికులను కలిసి మాట్లాడారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేసినా లాభాల్లో వాటా చెల్లించడం లేదన్నారు. దీనిపై సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు ఈశ్వర్, రాజన్న, తిరుపతి, కృష్ణ, హంస, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్రహ్మానందం

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

శ్రీరాంపూర్: పర్యావరణానికి గొడ్డలిపెట్టుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సింగరేణి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ప్రమాదకారిగా మారిన ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా రూపుమాపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, సర్వే అధికారి వెంకటేశం, ఎస్టేట్ అధికారి వరలక్ష్మి, పర్యావరణ అధికారి హనుమాన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి జీఎం

‘రాజకీయ జోక్యం సంస్థ మనుగడకే ప్రమాదం’

శ్రీరాంపూర్: సింగరేణిలో పెరుగుతున్న రాజకీయ జోక్యం వల్ల సంస్థ మనుగడకే ప్రమాదమని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ నిబంధనలకు విరుద్ధంగా పనిచేయాలని అధికారులపై కొందరు మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. సంస్థ అభివృద్ధికోసం కాకుండా వ్యక్తిగత పనులు చేయాలంటూ ఆదేశిస్తున్నారని, పాటించని అధికారులపై వేటుకు సిద్ధపడటం దుర్మార్గమన్నారు. మెడికల్ బోర్డులో కూడా భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేస్తున్నారన్నారు. సింగరేణి సంస్థను ప్రజాప్రతినిధులు, మంత్రుల భారీ నుండి కాపాడుకోవడానికి కార్మికులు నడుం బిగించాలని ఆయన కోరారు.

గణేశ్ శోభాయాత్రలో స్వల్ప వివాదం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదివేనగర్‌లో గణేశ్ నిమజ్జనం సందర్భంగా జరిగిన శోభాయాత్రలో మంగళవారం స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ముందుగా కాలనీవాసులు వినాయక నిమజ్జనం సోమవారం చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం ఉదయం దాటినా శోభాయాత్ర కొనసాగిస్తుండడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఇప్పటికే సమయం అధికమైందని, డీజేలను అక్కడి నుంచి పంపించారు. దీంతో పోలీసులు, కాలనీ వాసుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఏఎస్పీ సురేందర్ రావ్, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్ కాలనీ వాసులను సముదాయించి అక్కడి నుంచి పంపించడంతో గొడవ సద్దుమణిగింది.


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఏఎస్పీ, డీఎస్పీలు

గల్ఫ్‌కార్మికులకు ప్రభుత్వం అండ హర్షనీయం

జన్నారం: గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయడం హర్షనీయమని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న అన్నారు. మంగళవారం సంక్షేమ సమితి ఆధ్వర్యంలో దుబాయ్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్ ద్వారా విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎక్స్‌గ్రేషియా 2023 డిసెంబర్ 7 తర్వాత మృతి చెందిన కుటుంబాలకు వర్తింపజేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, ఎల్లయ్య, అలీం, నరేశ్, ఉప్పు సురేశ్, పెంచర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.


దుబాయ్‌లో గల్ఫ్ కార్మికుల సంబరాలు

మనస్తాపంతో ఒకరి బలవన్మరణం

దండేపల్లి: మండలంలోని చింతపల్లికి చెందిన చెల్ల సత్యం (47) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. గ్రామానికి చెందిన సత్యం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అతని తల్లి చనిపోవడంతో కొంత దిగాలుగా ఉంటున్నాడు. ప్రస్తుతం భార్య మమతలో కలిసి సీసీసీ నస్పూర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం చింతపల్లిలోని పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో భార్యతో చెప్పి వెళ్లాడు. కొద్దిసేపటికి ఫోన్‌చేసి నేను చనిపోతానని చెప్పగా వద్దని అతని భార్య బతిమాలింది. కొద్దిసేపటికి చింతపల్లికి చెందిన చందు అనే వ్యక్తి ఫోన్ చేసి మీ భర్త చనిపోయాడని చెప్పాడు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

జైనథ్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల మేరకు మండలంలోని మేడిగూడ ఆర్ గ్రామానికి చెందిన బుర్రి వెంకన్న (59) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

రైలు కిందపడి యువకుడు..

తలమడుగు: భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపంతో రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీస్ అధికారి ఎస్‌హెచ్‌వో భోజన్న తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా ఉమార్కెడ్ మండలంలోని బోరివన్ గ్రామానికి చెందిన సంజయ్‌దత్త వాగ ట్కర్(28) తలమడుగులో కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అతని భార్య కాపురానికి రాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

బేల: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాధిక తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వరూర్ గ్రామానికి చెందిన రైతు దడంజే హుస్సేన్ (30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో అతని భార్య సరస్వతి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఆటోడ్రైవర్..

ఆదిలాబాద్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వి వరాల మేరకు మావల పోలీస్ స్టేషన్ పరి ధిలోని రాంనగర్ కాలనీకి చెందిన ప్రవీణ్ (38)ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై ఆటో సక్రమంగా నడపడం లేదు. సోమవారం రాత్రి మ ద్యం మత్తులో ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతు ని భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపా రు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పలువురిపై దాడి కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం టీకానపల్లిలో సోమవారం రాత్రి తీర్థాల తిరుపతి కుటుంబంపై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ మంగళవారం తెలిపారు. టీకానపల్లిలో నివాసం ఉంటున్న తిరుపతి కుటుంబంపై భూ వివాదాల కారణంగా బాబాయ్, అతని కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి దాడి చేయడంతో తిరుపతితో పాటు అతని భార్య మమత, తల్లికి గాయాలయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన తీర్థాల శంకరయ్య, దీప్తి, సింగతి మురళీకృష్ణ, కాంద్రపు రాజయ్య, పద్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు.

కేకే ఓసీని సందర్శించిన డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి


డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీని మంగళవారం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. అధికారులను అడిగి బొగ్గు ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం గనికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధన కోసం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జీఎం దేవేందర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, మేనేజర్ రామరాజ్ ఉన్నారు.

ఆకట్టుకున్న భారీ గ్యాస్ సిలిండర్, బెలూన్


భారీ సిలిండర్ వద్ద డీఎస్‌వో, డీటీలు

కైలాస్‌నగర్: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్‌పీజీ గ్యాస్ భారీ సిలిండర్ నమూన, ఎయిర్ బెలూన్ ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను ఆహారభద్రత కార్డుదారులకు అందజేస్తోంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో బెలూన్ల ద్వారా భారీ సిలిండర్ నమూన ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి


రైతు వివరాలు సేకరిస్తున్న బొర్రన్న

బోథ్: మండలంలోని సాకెరలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు జాదవ్ భరత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామానికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. జీవో 194 ప్రకారం రూ.6 లక్షల పరిహారం అందించాలని, మృతుని భార్యకు ప్రతీనెల రూ.5 వేల పెన్షన్‌ను అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు తులసీరాం, తుకారాం, రాహుల్, తదితరులు ఉన్నారు.

పనిముట్ల సృష్టికర్త, వాస్తు శిల్పి విశ్వకర్మ

శ్రీరాంపూర్: దేశంలో మొట్టమొదటి పనిముట్ల సృష్టికర్తగా, వాస్తుశిల్పిగా విశ్వకర్మ నిలిచారని బీఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ అన్నారు. మంగళవారం సింగరేణి గనులపై బీఎంఎస్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద విశ్వకర్మ చిత్రానికి పూలమాలలు వేసి జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ద్వారక, లంక, అమరావతి వంటి అనేక నగరాలను నిర్మాణం చేసిన మహనీయులన్నారు. విశ్వకర్మ జయంతి ఒక కులానికి, మతానికి సంబంధించింది కాదని, కార్మిక వృత్తికి సంబంధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు కాసెట్టి నాగేశ్వరరావు, మోహన్‌రెడ్డి, రాగం రాజేందర్, రమేశ్, మంద కమలాకర్, గొల్ల మహేందర్, తిరుపతి, మోత ఓదెలు, కుంట రాజు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

17న జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి


జెండా ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌రెడ్డి

జైపూర్: సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్టీపీపీ ప్రధాన గేటు ఎదుట జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, కార్యదర్శి అంజిరెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీధర్, ఈగ సురేందర్, కోశాధికారి రాజశేఖర్, మధుకర్ చారి, పాత శివ, కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటం చరిత్రాత్మకం

శ్రీరాంపూర్: తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రాత్మక ఘట్టమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం శ్రీరాంపూర్ కటిక దుకాణాల వద్ద ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రాచరిక పాలనకు, కరుడుగట్టిన భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందన్నారు. కానీ నేడు దాన్ని వక్రీకరిస్తూ వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేయకుండా బీజేపీ కుయుక్తులు పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలవేన శంకర్

ప్రిన్సిపాల్ బదిలీ రద్దు చేయాలని ఆందోళన

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి బదిలీని రద్దు చేయాలని మంగళవారం విద్యార్థులు స్కూల్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఉన్నతమైన విద్యను అందించి రాష్ట్రస్థాయిలో పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ప్రిన్సిపాల్ తిరిగి పాఠశాలకు వచ్చేంత వరకు ఊరుకునేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఎస్సై రాజశేఖర్ విద్యార్థులను సముదాయించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో జిల్లా విద్యాధికారి యాదయ్యతో మాట్లాడించారు. బదిలీ విషయాన్ని పరిశీలిస్తామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై

సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తా ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవో జాతీయజెండాను ఆవిష్కరించి, జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, అధికారులు ఈఈ టీడబ్ల్యూ భీంరావు, ఐటీడీఏ అధికారులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

విరాళాలు సేకరించి వైద్యం

సారంగపూర్: అడెల్లి మహాపోచమ్మ నందనవనంలో ప్రైవేట్ వాచర్ రూపేశ్ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే కావడంతో ఎఫ్ఎస్ఓ నజీర్‌ఖాన్‌కు తన పరిస్థితిని వివరించాడు. వైద్యానికి రూ.2లక్షలకు పైగా అవుతాయని వైద్యులు చెప్పడంతో నజీర్‌ఖాన్ సోషల్ మీడియాలో రూపేశ్ పరిస్థితిని వివరించాడు. ఎంతోమంది దాతలు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా రూ.లక్షా17వేలు జమ చేయడంతో మంగళవారం ఆసుపత్రిలో చెల్లించి రూపేశ్‌ను డిశ్చార్జి చేయించారు. బాధితుడి కుటుంబీకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.


ఆస్పత్రిలో రూపేశ్ భార్యకు నగదు అందజేస్తున్న ఎఫ్ఎస్‌వో నజీర్‌ఖాన్